ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 17 ఫిబ్రవరి 2024 | 5



వర్క్ ఫ్రం హోం ఉద్యోగం పేరుతో.. రూ.4.08 లక్షల దోపిడీ
నకిలీ నోట్లతో మోసగించిన నలుగురి అరెస్టు 7



బంద్ విజయవంతం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16 : బీజేపీ ప్రభుత్వ వినాశనకర విధానాలకు నిరసనగా దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణభారత్ బంద్ విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ చేశారు. కార్మికులు, రైతులకు అన్యాయం చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోదీ నాయకత్వంలోని బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గద్దె దింపాలని పలు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు సెంటర్లోని హెడ్ పోస్టాఫీసు నుంచి శ్యామలా సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా కోటగుమ్మం సెంటర్ వరకూ కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ చేసి అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఏవీ రమణ మాట్లాడుతూ గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు దోచిపెట్టారని విమర్శించారు.బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజల పట్ల తీవ్రమైన నిరంకుశత్వం ప్రదర్శించిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చిన మోదీ మాట నిలబెట్టుకోకుండా రైతు చట్టాల పేరుతో వారి భూములను లాక్కుని కార్పొరేట్లపరం చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొండలరావు, నల్ల రామారావు, రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జోజి, ఎస్ఎఫ్ఐ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం తేవాలి

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆమె స్వీప్ నోడల్ అధికారులతో సమీక్షించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్(స్వీప్) ఓటర్ల వద్దకు చేరాలన్నారు. ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించడానికి భారత ఎన్నికల సంఘం ఈస్వీప్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. యువ ఓటర్ల నమోదుపై మరింత దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, డీఈవో కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ అధికారి ఎస్.సుభాషిణి, ఆర్ఎంసీ వైద్య అధికారి డా.వి.వినూత్న, డిప్యూటీ డీఈవో ఈ.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



రథసప్తమిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సూర్యభగవానుడికి నమస్కరించి ప్రత్యేక పూజలు చేశారు. నిడదవోలులో భక్తజనం ఇలా చేతులెత్తి మొక్కారు.



ఉద్యోగులు మూడో రోజు నిరసనలతో హోరెత్తించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు విధులకు ఆటంకం కలగకుండా జిల్లా వ్యాప్తంగా భోజన విరామ సమయంలో శుక్రవారం మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు.ధవళేశ్వరం నీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద ఇరిగేషన్ ఉద్యోగులు ధర్నా చేశారు. - ధవళేశ్వరం



టిక్కెట్..టెన్షన్!

అభ్యర్థుల ఎదురుచూపులు

ఒక పక్క జనం.. మరో పక్క నాయకులు ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయోనని ఎదురుచూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌పై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎక్కడ చూసినా అదే చర్చ సాగుతోంది. మరో పక్క ఇంకా టిక్కెట్లు ఖరారు కాకపోవడంతో అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- ఇంకనూ ఖరారు కాని సీట్లు
- అయోమయంలో అభ్యర్థులు
- టీడీపీ- జనసేన పొత్తుతో ఆలస్యం
- జిల్లాలో 7 అసెంబ్లీ, 1 ఎంపీ సీటు
- టీడీపీ నుంచి ముగ్గురికి గ్రీన్‌సిగ్నల్?
- రాజానగరం జనసేనకే..
- రాజమహేంద్రి ఎంపీ సీటెవరిదో
- వైసీపీలో 3 సీట్లు పెండింగ్

సార్వత్రిక ఎన్నికలకు ఇంకెంతో దూరం లేదు. ఈ నెలలోనే షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. షెడ్యూల్ వచ్చిన తర్వాత 60 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందనే వాదన ఉంది.అంటే ఏప్రిల్ మూడు, నాలుగు వారాల్లో ఎన్నికలు జరగవచ్చు. అయితే రాజకీయ పార్టీలు ఇంకా పూర్తిస్థాయిలో తమ అభ్యర్థులను ఖరారు చేయలేదు. తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తు వల్ల కొన్ని స్థానాల్లో కొందరు నేతలు త్యాగం చేయకతప్పని పరిస్థితి ఉంది. మరో వైపు బీజేపీ, జనసేన పార్టీలతో బీజేపీ కూడా జత కట్టనుందనే సమాచారం ఉంది. దీంతో మరింత త్యాగం చేయాల్సి ఉంటుంది. ప్రజావ్యతిరేక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా అందరూ ఐక్యంగా ఉంటూ, అధికారంలోకి రావాలనే కోరికతో టీడీపీ-జనసేన ఉన్నాయి.వాటికి బీజేపీ తోడు కానుంది. టీడీపీ-జనసేనతో కలిసి వచ్చేందుకు వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయి.కానీ టీడీపీ -జనసేన పార్టీలు బీజేపీతో పొత్తు పెట్టుకుంటారనే సమాచారం వామపక్షాలకు ఇబ్బందిగా మారింది. కానీ గతంలో ఎన్టీఆర్ ఒకవైపు బీజేపీతో స్నేహసంబంధాలు పెట్టుకుని,వామపక్షాలనుకలుపుకున్నారని,ఈసారి వామపక్షాలతో కూడా టీడీపీకి పొత్తు ఉంటుందనే ప్రచారం ఉంది.ఈ పరిస్థితుల్లో పొత్తులు, సామాజిక వర్గాలను సమన్వయ పరచుకుంటూ టికెట్లను ఖరారు చేయాల్సి వస్తోంది.

ఇంకా తేలని అభ్యర్థిత్వం..

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానం ఉన్న సంగతి తెలిసిందే. తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తులు ఖరారైనప్పటికీ..ఎవరు ఎక్కడ పోటీచేస్తారు.. అక్కడ అభ్యర్థులెవరనేది అనేది ఇంకా ఖరారు కాలేదు. కానీ జిల్లాలో తెలుగుదేశం అధిష్ఠానం ముగ్గురికి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు చెబుతున్నారు. గోపాలపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు, రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్లను దాదాపు ఖరారు చేసినట్టు చెబుతున్నారు. రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక్కడ నుంచి జనసేన టికెట్ బత్తుల బలరామకృష్ణ ఆశిస్తున్నారు. కానీ ఇక్కడ తనకే టికెట్ వస్తుందని టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి వాదిస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తిరిగి టికెట్ తనదేనని చెబుతుండగా, తనదేనని జనసేన నేత, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ అంటున్నారు. శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఇంకా ఎవరికీ టికెట్లు ఖరారు కాలేదని, తెలుగుదేశం అభ్యర్థులను తమ అధినేత చంద్రబాబు, జనసేన అభ్యర్థులను పవన్‌కల్యాణ్ ప్రకటిస్తారని చెప్పడం గమనార్హం. కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గంలో కూడా టీడీపీ టికెట్ ఎవరిదనేది తేలలేదు. మాజీ మంత్రి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కెఎస్.జవహర్ టికెట్ కోసం తీవ్రంగా పట్టుపడుతున్నారు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావును ఇక్కడ నుంచి బరిలో దించడానికి మరో వర్గం ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. వీరిద్దరూ కాకుండా మరో 8 మంది కొవ్వూరు టిక్కెట్ కోసం పోటీపడడం గమనార్హం. నిడదవోలులో పోరు రసవత్తరంగా ఉంది. ఇక్కడ నుంచి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్యనారాయణ టికెట్ కోసం పోటీ పడుతున్న సంగతి తెలిసిందే.ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నట్టు కూడా ప్రచారం ఉంది. ఎందుకంటే గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో జనసేనకు 20 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జిల్లాలో టికెట్ల ఖరారు ఇంకా పూర్తి కాకపోవడంతో ఆశావహుల్లో టెన్షన్ పెరుగుతోంది. బీజేపీ జతకడితే రాజమహేంద్రవరం ఎంపీ సీటు కేటాయించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఫ్యాన్‌లో.. ఆ మూడెవరికోసమో..

వైసీపీ ఇప్పటికే నలుగురిని నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా ప్రకటించింది. వారంతా ప్రస్తుత ప్రజాప్రతినిధులే అయినప్పటికీ వారి స్థానాల నుంచి మరో స్థానాలకు బదిలీ చేయడం సమస్యగా మారింది. వీరిలో ఇద్దరు మంత్రులు ఉండడం గమనార్హం. గత ఎన్నికల్లో వారిని ఎన్నుకున్న ప్రజలకు సేవ చేయకుండా, ఆయా నియోజవర్గాలను వదిలేసి కొత్తవాటిలో ఓట్లకు తంటాలు పడుతున్నారు.వైసీపీ ఇంకా అనపర్తి, రాజానగరం, నిడదవోలు ఎమ్మెల్యేల విషయంలో స్పష్టత ఇవ్వవలసి ఉంది. ఇంకా స్పష్టత రాక వీరినీ టెన్షన్ పీడిస్తోంది.

కాంగ్రెస్‌లో జోష్

వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా పగ్గాలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. ఆమె జిల్లాలో కూడా పర్యటించారు. తన అన్న ,సిఎం జగన్ వైఖరిని తూర్పారబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం పెరుగుతుందనే చర్చ మొదలైంది. ఈ పరిస్థితుల్లో ఈసారి కాంగ్రెస్ కూడా ఎన్నికల్లో పోటీ చేయనుంది. ఇప్పటికే టికెట్లు ఆశించేవారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.ఇదిలా ఉండగ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌ఠాగూర్ 29న టిక్కెట్లపై స్పష్టత ఇస్తామని ప్రకటించారు.



భోజనం ఎలా ఉందమ్మా?

విద్యార్థినిని ప్రశ్నించిన ఆర్‌జేడీ నాగమణి

బిక్కవోలు, ఫిబ్రవరి 16: పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల ఆర్‌జేడీ జి.నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. ఊలపల్లి ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, టాబ్స్, ఐఎఫ్‌బీలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినితో మాట్లాడి భోజనంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి ఉన్నారు.

ధవళేశ్వరంలో ముస్తాబవుతున్న రథం



20న జనార్దనుడి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి16 : ధవళేశ్వరం జనార్దన స్వామి రథోత్సవాన్ని ఈ నెల 20వ తేదీన వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఆలయ అర్చకులు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని మూడు సార్లు ప్రదక్షణగా తిప్పి తూర్పు ముఖంగా నిలిపి ఉంచారు.రథాన్ని దర్శించుకునేందుకు భక్తజనం తరలివచ్చారు. శనివారం నుంచి స్వామి వారి రథాన్ని ముస్తాబు చేసే పనులు ప్రారంభిస్తారు.



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామి

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆరంభం

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారికి వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం స్వామి వారి నూతన రథానికి పూజలు నిర్వహించారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు. శ్రీకర, శుభకర, ప్రణవ స్వరూపుడైన ఆది దేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా తీర్చిదిద్దారు. స్వామివారు ఉదయం సూర్య వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.26వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. - వివరాలు 7లో



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

సినిమా చూపిస్తే భయమెందుకు?

రాజధాని ఫైల్స్ సినిమా అడ్డుకోవడంపై జవహర్ ఆగ్రహం

కొవ్వూరు, ఫిబ్రవరి 16 : రాజధాని అమరావతి విధ్వంసంపై రాజధాని ఫైల్స్ సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించడంతో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి భయపడుతున్నారని అందుకే సినిమాను ప్రజల చెంతకు చేరకుండా అడ్డుకుంటున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ అన్నారు. కొవ్వూరు నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని ఫైల్స్ సినిమా చూసి వైసీపీ నాయకులకు చెమటలు పడుతున్నాయన్నారు. అధికారంలోకి రావడంతోనే అమరావతి రాజధాని కాదు, మూడు రాజధానుల ముచ్చట తెచ్చి ఐదేళ్లు కాలయాపన చేశారన్నారు. ఓటమి తప్పదని గ్రహించి మాట మార్చి హైదరాబాద్ రాజధాని చేస్తామని చెప్పే పరిస్థితి చూస్తుంటే జగన్మోహనరెడ్డి నిలకడలేని తనం బయట పడుతుందన్నారు. ఈ చిత్రం ద్వారా జగన్మోహనరెడ్డి దుర్మార్గాలను ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు తెలియజేస్తామన్నారు.అమరావతి రైతుల ఘోషతో ఏప్రిల్‌లో జగన్మోహనరెడ్డి దుకాణం బంద్ అవు తుందన్నారు. సినిమా అందరూ చూసి అమరావతి ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు.యనమదల శివరామకృష్ణ ప్రసాద్, నామా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సినిమా అడ్డుకోవడం పిరికిపంద చర్య : గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16: రాజధాని అమరావతి రైతుల ఆవేదనకు రూపంగా వచ్చిన రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవడం పిరికిపంద చర్య అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ,రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఏపీ రాజధాని కోసం 34 వేల ఎకరాలను రైతులు నిస్వార్థంగా ఇచ్చారని అప్పుడు ప్రతిపక్షంలో జగన్ దీనిని స్వాగతిస్తున్నామని ప్రకటించాడన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు పేరుతో డ్రామాలు ఆడాడని మండిపడ్డారు.జగన్ అధికారంలోకి వచ్చాక 276 మంది రైతులను పొట్టన పెట్టుకుని,వేల మంది రైతు కుటుంబాలను రోడ్డున పడేశాడని ధ్వజమెత్తారు.ఈ నేపథ్యంతో రాజధాని ఫైల్స్ సినిమా తీస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు.జగన్ రెడ్డి చిత్రానికి రెవెన్యూ అధికారులు, కలెక్టర్లు దగ్గరుండి కలెక్షన్స్ చూడాలని సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు.



ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే.. వదలొద్దు!

నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదలొద్దని.. అదే సమయంలో ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి పోలీస్ ఉన్నతాధికారులు హితబోధ చేశారు. జాంపేట పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లాలోని ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డులకు ఎన్నికల నియమావళిపై శుక్రవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో ఇప్పటికే తర్ఫీదు పొందిన నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు అనసూరి శ్రీనివాస్, రామకృష్ణ(దేవరపల్లి) పీపీటీ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలు వివరించారు. సమస్యాత్మక పోలీస్ స్టేషన్లను గురించి కారణాలను వివరిస్తూ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా నివేదిక సమర్పించాలన్నారు.ప్రజల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని,అనవసరవిషయాల్లో జోక్యం వద్దని సూచించారు.

మెడిసిన్ విద్యార్థులకు ఫ్యామిలీ అడాప్షన్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16 : ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు సమాజంలో నెలకొన్న వివిధ ఆరోగ్యపరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్) డాక్టర్ కేవీ శివప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం వైద్యవిద్యార్థులకు ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఒక్కో వైద్య విద్యార్థికి ఐదు కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్నమాచారి రోడ్డు, దుర్గానగర్, వాంబేకాలనీ పరిధిలోని అర్బన్ ఏరియాల్లోని కుటుంబాలను కేటాయించడం జరుగుతుందన్నారు.

- వైభవంగా ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు
- రథసప్తమి పర్వదినాన సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం
- అడుగడుగునా భక్తుల నీరాజనాలు
- ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాగతం


ముద్రికాలంకరణ చేస్తున్న పండితులు

అంతర్వేది లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు ప్రారంభం

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి రోజున వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైఖానస ఆగమానుసారం, వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి. బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు.


చంద్రప్రభ వాహనంపై స్వామివారు


రథాన్ని లాగుతున్న భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి 16:

కల్యాణోత్సవాలకు శ్రీకారం

శ్రీకర, శుభకర, ప్రణవ స్వరూపుడైన ఆది దేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దే అపూర్వ ఘట్టానికి శుక్రవారం అంతర్వేది ఆలయం వేదికైంది. ఆచారం ప్రకారం కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల సంయుక్త నిర్వహణలో సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ముద్రికాలంకరణ నిర్వహించారు. విశేష పూజలందుకున్న స్వామి, అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. అర్చకులు వేదమంత్రోచ్చారణలతో నీల మేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు వార్షిక ఉంగరాలను సమర్పించారు. రెండు కుటుంబాల ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహదూర్, ఉండపల్లి, బెల్లంకొండ, ముప్పర్తి కుటుంబ సభ్యులు, కొపనాతి కృష్ణమ్మ కుటుంబ సభ్యులు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, మాజీ సర్పంచ్ వనమాలి మూలాస్వామి, కేఎస్ఎన్ రాజు, వలవల రాంబాబు, సర్పంచ్ కొండా జాన్ బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, వాహనకారులు తదితరులు పాల్గొన్నారు.

తొలిపూజ

ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ చైర్మన్, అధికారులు, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, అగ్నికుల క్షత్రియులు పూల మాలలు వేశారు. అనంతరం శ్రీ స్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనచోదకులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజావారి వీధి)కి చేర్చారు.

సూర్యప్రభ

తొలిరోజు శ్రీలక్ష్మీనరసింహుడు శృంగవరప్పాడు వాస్తవ్యులు అడబాల వెంకన్న కుమారులచే నిర్మితమైన సూర్యవాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి వారు హారతులు ఇచ్చారు. రథ సప్తమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళా భక్తులు సూర్య నమస్కారాలు చేశారు.

చంద్రప్రభ

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి, మోరిపోడు వాస్తవ్యులు ముప్పర్తి సుబ్బారావు కుటుంబ సభ్యులచే నిర్మితమైన చంద్రప్రభ వాహనంపై రాత్రి 8 గంటలకు స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతుల నడుమ పురవీధుల్లో ఊరేగారు. స్వామివారికి భక్తులు హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

నేడు గరుడ పుష్పక వాహనంపై

శనివారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారు గరుడ పుష్పకవాహనంపై ఊరేగుతారు. గరుడు వేదమూర్తి స్వామివారి వాహనం. నిత్యం స్వామివారిని సేవిస్తారు. భక్తుల మనోరథం నెరవేర్చడం కోసం శ్రీస్వామివారు తన హృదయమనే పుష్పంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తారు. దీనిని చాటిచెప్పేందుకే స్వామివారు పుష్పక వాహనం అధిరోహిస్తారు. రాత్రి 7 గంటలకు వాహన సేవ జరుగుతుంది.


కొబ్బరికాయ కొట్టి రథాన్ని ముందుకు కదిలిస్తున్న చైర్మన్, ఆలయ అధికారులు, వాహనకారులు

11 రోజుల పాటు

మహాకుంభాభిషేకం

జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఘనంగా ఏర్పాట్లు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జ్యోతుల నెహ్రూ,నవీన్ తదితరులు

జగ్గంపేట, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికాసమేత మల్లికార్జున స్వామి దేవస్థానం నందు కోటి శివలింగాలతో నిర్వహించనున్న మహా కుంభాభిషేకానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఇర్రిపాక శివాలయం వద్ద కోటి మట్టి శివలింగాలతో మహాకుంభాభిషేక సమిత రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. శృంగేరీ పీఠాధిపతి ఆశీస్సులతో ఈ నెల 26 నుంచి మార్చి 7 వరకు 11 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొని పరమశివుడి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులందరూ ఈ కోటి పార్థివ శివలింగాలను తమ స్వహస్తాలతో అభిషేకించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు సాయితేజ, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, మంగ రైతు రామకృష్ణ, కందుల చిట్టిబాబు, తోటరవి, తోట గాంధీ, వీరంరెడ్డి కాశీబాబు, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కన్నబాబు, జాస్తి వసంత్, నీలం శ్రీను, ఉంగరాల రాము, పాఠంశెట్టి మురళీకృష్ణ, పైడిపాల సూరిబాబు, కందుల బాబ్జి, తూము కుమార్, అడబాల భాస్కరరావు, బదిరెడ్డి అచ్చన్నదొర పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి వెండి ఆభరణాలు

పిఠాపురం, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఉన్న రాజరాజేశ్వరీదేవికి దాతలు వెండి ఆభరణాలు బహూకరించారు. తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలకు చెందిన డాక్టర్ కంచి చంద్రయ్య, డాక్టర్ నందినిరాణి దంపతులు సుమారు 6.50 లక్షలు విలువైన ఎనిమిదిన్నర కిలోల వెండితో వెండి చీర, వక్షస్థలం, కిరీటం, హస్తాలు, గణపతి సుబ్రహ్మణేశ్వరుడు, పీఠం తయారు చేయించారు. వాటిని శుక్రవారం అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు వాటిని అమ్మవారి ముందుంచి పూజలు నిర్వహించారు. దాతలను ఆలయ అధికారులు శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, ఏసీ పులి నారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.


ఆభరణాల బహూకరణ

కొవిడ్ సాయం స్వాహాపై ఏసీబీ విచారణ

కాట్రేనికోన, ఫిబ్రవరి 16: కొవిడ్ డెత్ ఎక్స్‌గ్రేషియా పంపిణీలో అవకతవకలపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఇందులో అనేక వాస్తవాలు, అక్రమాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన కొంకి సింహాద్రి 2021 మే 22న కొవిడ్‌తో కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. అతడి భార్య మంగాదేవి కొవిడ్ ఆర్థిక సహాయం కోసం అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసినా సొమ్ములు అందలేదు. చివరకు విసిగి వేసారిన మంగాదేవి సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకుంది. దీంతో అసలు విషయం బయట పడింది. కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం రికార్డుల ప్రకారం ఏడాది క్రితమే రూ.50వేలు ఎస్‌బీఐ ఖాతాకు జమ చేసినట్టు, కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ సెక్షన్లో సంప్రదించాలని సమాచారం అందించారు. అయితే ఆ బ్యాంకు ఖాతా బినామీదిగా తేలింది. ఆ ఖాతా తనది కాదని, సొమ్మును కావాలని వేరే జిల్లాకు చెందినవారి బ్యాంకు ఖాతాకు బదలాయించారని బాధితురాలు మంగాదేవి లబోదిబోమంటోంది. ఈ వ్యవహారంపై ఆమె కాకినాడ డీఆర్వోతో పాటు హెచ్ సెక్షన్ సిబ్బందిని ఎన్నిసార్లు కలిసినా సరైన సమాధానం రాలేదు. సిబ్బంది చేతివాటంతో కలెక్టర్ కార్యాలయంలో కొవిడ్ ఫైలు మాయమైనట్టు తెలిసింది. దాంతో అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోలేక, తనకు ఆర్థిక సాయం అందించలేక విచారణ పేరుతో వాస్తవాన్ని దాచిపెడుతూ కాలయాపన చేస్తున్నారని ఆమె వాపోయింది. తాజాగా మంగాదేవి సమాచారహక్కు చట్టం ద్వారా మరోసారి కలెక్టర్ కార్యాలయానికి లేఖ రాసింది. అసలు విషయం బయటపడడంతో కలెక్టర్ కృతికా శుక్లా కోనసీమ జిల్లా కలెక్టర్ ద్వారా కాట్రేనికోన తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఇదే సమయంలో మంగాదేవి తన సొమ్ము కాజేశారని ఏసీబీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏసీబీ రాజమహేంద్రవరం డీఎస్పీ విచారణకు ఆదేశించడంతో సిబ్బంది తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఏసీబీ సిబ్బంది ఇటీవల నడవపల్లిలోని మంగాదేవి ఇంటికి వెళ్లి విచారించింది.



రాజమౌళిని కలిసిన మార్గాని

కడియం, ఫిబ్రవరి 16: ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళిని శుక్రవారం కడియపులంక వీర హనుమాన్ నర్సరీ రైతు, రాష్ట్ర టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ కలిశారు. యుఆర్ హోం మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాజమౌళి దంపతులతో కొద్దిసేపు మాట్లాడి మాల్ అధినేత గోపాలకృష్ణతో కలిసి ఆంథోరియం రెడ్ మొక్కను అందజేశారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన కడియం నర్సరీల సందర్శనకు కుటుంబ సభ్యులతో కలిసి వస్తానని రాజమౌళి ఈ సందర్భంగా వారికి తెలిపారు.

లింక్ పంపించి రూ.4 లక్షలకు బురిడీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లింక్ దోపిడీ కేటుగాళ్ల వలలో పడి ఓ గృహిణి మోసపోయారు. ఆమె త్రీటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివాసం ఉండే గెడ్డం దివ్య సురేఖకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. గవర్నమెంట్ ప్లాట్‌ఫాంతో వర్క్‌ఫ్రం హోం ఇస్తామని, ఇంటి దగ్గర నుంచే డబ్బులు సంపాదించుకోవచ్చని ఆ మెసేజ్ సారాంశం. దీంతో ఆ మెసేజ్‌కి సురేఖ జవాబు పంపారు. వాట్సాప్ ద్వారా అవతలి వాళ్లు ఈమెతో మాట్లాడి టెలిగ్రాంలో ఒక లింక్ పంపించారు. దానిలో ఉన్న వర్క్ చేసి బాధితురాలు వాళ్లకు పంపించారు. డబ్బులు చెల్లిస్తే ఇంకొంత వర్క్ ఇస్తామని మళ్లీ మెసేజ్ పెట్టారు. ఈ క్రమంలో సురేఖ దఫదఫాలుగా రూ.4,08,000 సదరు సైబర్ నేరగాళ్లకు పంపించారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలంటే రూ.5లక్షలు చెల్లించాలని నేరగాళ్లు అంటున్నారని సురేఖ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. లింక్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అపరిచితులు పంపించే లింక్‌లను క్లిక్ చేయవద్దని.. అనుమానం వస్తే పోలీసులను సంప్రదించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌కు ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు



అన్నవరం, ఫిబ్రవరి 16: ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులకు అందుబాటులో సేవలందిస్తున్న అన్నవరం రైల్వేస్టేషన్‌కు ఫుడ్‌సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈట్‌రైట్ సర్టిఫికెట్‌ను అందించినట్టు అన్నవరం రైల్వేస్టేషన్ మాస్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. విజయవాడ డివిజన్‌లో ఈ హోదా పొందిన స్టేషన్ అన్నవరం రైల్వేస్టేషన్ కావడం విశేషమని అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో నాంపల్లి (హైద్రాబాద్) తర్వాత ఈ జోన్‌లో రెండో స్టేషన్‌గా గుర్తింపు పొందింది. స్టేషన్‌లో ఉన్న క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆహార భద్రత, పరిశుభ్రత, విక్రేత వ్యక్తిగత శుభ్రత, ఫుడ్ గడువు తేదీల వ్యర్థాల తొలగింపు తదితర వాటిని పరిగణలోకి తీసుకుని ఈ గుర్తింపు పత్రం జారీ చేస్తారని సతీష్‌కుమార్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

మైనర్‌తో సహా ముగ్గురి అరెస్టు

అనపర్తి, ఫిబ్రవరి 16 : గంజాయి పీల్చేందుకు ప్రత్యేకంగా గదిని అద్దెకు తీసుకుని గంజాయి మత్తులో జోగుతున్న బాలుడితో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. మరో ఇద్దరు యువకులు పరారైనట్లు ఎస్ఐ తెలి పారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తిలోని పద్మశ్రీ థియేటర్ సమీపంలో పెంకుటిల్లును అద్దెకు తీసుకున్న కొందరు యువకులు గంజాయి మత్తులో జోగుతున్నట్లు వచ్చిన సమాచారంతో సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గదిలో గంజాయి మత్తులో జోగుతున్న మైనర్ బాలుడి సహా కర్రి అజయ్ గోపాల కృష్ణారెడ్డి, దుప్పలపూడికి చెందిన తాతపూడి దివాకర్‌లు పట్టుబడగా దుప్పలపూడి గ్రామానికి వరపు సాయి, అనపర్తికి చెందిన పిల్లి కార్తీక్ పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 1కిలో 127 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని గంజాయి సరఫరా చేసిన వారి వివరాలను సేకరించే పనిలో పడ్డామని అన్నారు. అనపర్తి, దుప్పలపూడి గ్రామాల్లో గంజాయి సేవించే యువత పెరిగినట్లు గుర్తించామని ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. పట్టుబడ్డ నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సత్యదేవుడిని దర్శించుకున్న నటి హేమ

అన్నవరం, ఫిబ్రవరి 16: సత్యదేవుడి సన్నిధిలో సినీనటి హేమ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా ఆమెతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు, ఉద్యోగులు ఆసక్తి కనబర్చారు.


సత్యదేవుడిని దర్శించుకున్న హేమ

నకిలీ నోట్లతో మోసం చేసిన వ్యక్తుల అరెస్టు


నిందితులతో పోలీసులు


నకిలీనోట్లు, కెమికల్ బాటిల్స్

అన్నవరం, ఫిబ్రవరి 16: నకిలీ నోట్లతో ఒకరిని మోసం చేసిన వ్యక్తులను అన్నవరం పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురానికి చెందిన అనుసూరి రాజబాబు వద్ద ఒక స్థలం అమ్ముతానని అదే గ్రామానికి చెందిన ఈటి జగదీష్ రూ20 లక్షలు తీసుకున్నాడు. అయితే స్థలం విక్రయించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తాత్సారం చేస్తుండడంతో తీవ్ర ఒత్తిడి చేశారు. అయితే తన వద్ద డబ్బులు లేవని బ్లాక్‌మనీ ఉందని దానిపై కెమికల్స్ పూస్తే అసలైన నోట్లుగా మారతాయని పేర్కొంటూ కొన్ని అసలు నోట్లపై నలుపు రంగు పూసి తర్వాత కెమికల్‌తో కడగడంతో అవి అసలు కరెన్సీగా కనిపించడంతో నమ్మి 5 నోట్లకట్టలు తీసుకున్నారు. తర్వాత మోసపోయినట్లు గ్రహించిన రాజబాబు మిగిలిన మొత్తంపై మరోసారి ఒత్తిడి చేయడంతో శుక్రవారం అన్నవరం వస్తే మిగిలిన నోట్లకట్టలు ఇస్తానని జగదీష్ తెలిపారు. దీంతో రాజబాబు పోలీసులకు ముందస్తు సమాచారమిచ్చారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ప్రత్తిపాడు ఇన్‌చార్జి సీఐ ఎస్.లక్ష్మణరావు, అన్నవరం ఎస్ఐ కిశోర్ సిబ్బందితో జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపంలో వలపన్ని జగదీష్‌తో పాటు మరో ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 నోట్ల కట్టలు, కెమికల్ బాటిల్స్, వారు వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకుని ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని ఎస్ఐ కిశోర్ తెలిపారు.

వైద్య రంగంలో సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన ఫలితాలు


ముఖ్య అతిథిని సత్కరిస్తున్న గన్ని భాస్కరరావు తదితరులు

రాజానగరం, ఫిబ్రవరి 16: వైద్య రంగంలో సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విశాఖపట్నంలోని ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్ర మెడికల్ టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర శర్మ అన్నారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 16వ స్నాతకోత్సవం శుక్రవారం సాయంత్రం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జితేంద్రశర్మ మాట్లాడుతూ ఒక నియమంగా పెట్టుకుని 100 మంది చొప్పున ఉచిత వైద్యం చేయాలని యువ డాక్టర్లకు ఆయన సూచించారు. శ్రీలంకలోని పెరడేనియా యూనివర్సిటీలో డెంటల్ విభాగం ప్రొఫెసర్లు జయసింఘే, అట్టిగళ మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు ప్రపంచ దేశాల మధ్య ప్రస్తుతం హద్దులు లేవన్నారు. దీనిలో భాగంగా 2018 బ్యాచ్ ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లకు ఈ కార్యక్రమంలో డిగ్రీలు ప్రదానం చేశారు. కళాశాల అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరిబాబు గ్రాడ్యుయేట్లతో మెడికల్ ఎథిక్స్‌పై ప్రమాణం చేయించారు. అనంతరం ముఖ్య అతిథి జితేంద్ర శర్మను జీఎస్ఎల్ వైద్య సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

98 శాతం ఉత్తీర్ణత...

జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 2018 బ్యాచ్ ఎంబీబీఎస్ పార్ట్‌వన్‌లో 143 మందికి 140 మంది (98) శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ తెలిపారు. 95 మంది 60శాతం కంటే ఎక్కువ, 25 మంది 75శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 600లకు 595 మార్కులతో మేరీ శ్రీకళ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇదే బ్యాచ్ పార్ట్-2లో 145 మందికి 139 మంది అనగా 95.86 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 76 మంది ఎక్కువ మార్కులతో ఫస్ట్‌క్లాస్ సాధించారన్నారు. 25 మంది 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 600లకి 598 మార్కులతో కాండ్రేగుల వసంతలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని బాస్కరరావు, మెడికల్ కళాశాల డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. .

4వ ఖేలో ఇండియా సమన్వయకర్తగా శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే,ఫిబ్రవరి 16: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో అసోంలోని గువహటిలో ఈనెల 17 నుంచి 22వరకూ జరిగే 4వ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ కబడ్డీ పోటీలకు సమన్వయకర్తగా డాక్టర్ జి.శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ న్యూఢిల్లీలోని ఏఐయూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పీఆర్వో, డీపీఏ సీహెచ్ సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు శ్యామ్‌కుమార్‌ను అభినందించిన అనంతరం మాట్లాడుతూ గత ఏడాది 3వ ఖేలో ఇండియా గేమ్స్‌కు సమన్వయకర్తగా శ్యామ్ కుమార్ వ్యవహరించారన్నారు. ఖేలో ఇండియా సౌత్‌జోన్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్‌ను రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, సీఈ శ్రీనివాసులు, మాలోతు రమేష్ అభినందించారు.


నాటిక పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నాటిక పోటీలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై మూడు రోజులు పాటు జరిగే ఈ పోటీలను నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, తాటిపర్తి సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వచ్చిన కళాకారులు మూడు రోజులు పాటు పలు నాటికలను ప్రదర్శించనున్నారు.

నూతన రథానికి పూజలు



అన్నవరం, ఫిబ్రవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి కొండపై వివిధ పర్వదినాల్లో సేవలందించేందుకు నూతనంగా తయారుచేయించిన టేకు రథానికి శుక్రవారం ఉదయం పండితులు కొండదిగువ పంపా సత్రం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో రామచంద్రమోహన్ రథాన్ని ప్రారంభించారు. అయితే రథాన్ని కొండపైకి తీసుకెళ్లే సమయంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద బోల్ట్‌లు తగులుకుని ఊడిపోవడంతో కొద్దిసేపు రథాన్ని నిలిపివేసి మరమ్మతులు చేయించిన అనంతరం కొండపైకి తీసుకెళ్లారు. అయితే ఈ ఆలస్యం కారణంగా శుభఘడియలు ముగియడంతో రథోత్సవం వాయిదా వేశారు. త్వరలో మరో మంచి ముహూర్తంలో రథోత్సవం చేపట్టనున్నట్లు పండితులు పేర్కొన్నారు.

పిల్లలతో పని చేయించారు



అనపర్తి, ఫిబ్రవరి 16: అనపర్తిలోని ద్వారంపూడి బుల్లెమ్మాయి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం కూలీలుగా మారిపోయారు. పాఠశాలలో పలుగు, పారలు పట్టుకుని మట్టి తవ్వి మోస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చదువుకోవాల్సిన విద్యార్థులకు ఇలా పని చెప్పడాన్ని పలువురు తప్పుబట్టారు.

రేపు చినజీయర్ స్వామి రాక

కోరుకొండ, ఫిబ్రవరి16: చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి కోనేరు, స్వామివారి కొండ మెట్లమార్గం, రంగనాదస్వామి ఆలయ పునఃనిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ఈనెల 18న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి కోరుకొండకు వస్తున్నట్లు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శుక్రవారం సాయంత్రం కోరుకొండలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై చినజీయర్‌స్వామి రాక సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లుపై సమీక్షించారు.

ఏజెన్సీ సమాచారం

ఏజెన్సీలో భారత్ బంద్ విజయవంతం


రంపచోడవరం ప్రధాన కూడలిలో నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

రంపచోడవరం, ఫిబ్రవరి 16: రైతులు పండించిన పంటలకు సమగ్ర ఉత్పత్తి ధరకు 50శాతాన్ని కలిపి కనీస మద్దతు ధరను నిర్ణయించాలని, దేశ వ్యవసాయ రంగాన్ని స్వదేశీ, విదేశీ సామ్రాజ్యవాద కార్పొరేటర్లకు అప్పజెప్పేందుకు చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు శుక్రవారం చేపట్టిన గ్రామీణ అఖిల భారత బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావు, వేట్ల శ్రీరాములు, కొండమొదలు సర్పంచ్ వేట్ల విజయ, ఏవికేఎంఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: రైతులకు గిట్టుబాటు ధర, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. బంద్ నేపథ్యంలో ఎటపాకలో ఆశా కార్యకర్తలు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భద్రాచలం-ఎటపాక ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భద్రాచలం నుంచి ఏపీ వైపు ఆర్టీసీ సర్వీసులను నిలిపివేశారు.

మోతుగూడెం: రైతుల ఉద్యమంపై కేంద్రం తీరుని నిరసిస్తూ రైతు సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన భారత్ బంద్ ప్రశాంతంగా జరిగింది. ఆందోళనకు కార్మిక సంఘాలు మద్దతుగా నిలిచాయి. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్స్, మధ్యాహ్న భోజనం కార్మికులు డొంకరాయిమార్కెట్‌సెంటర్‌లో ర్యాలీ చేశారు. తక్షణమే కేంద్రం రైతులు, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

రైతులకు మద్దతుగా సీఐటీయూ ర్యాలీ

కూనవరం,ఫిబ్రవరి 16: దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతు పోరాటాలకు మద్దతుగా కూనవరం నుంచి టేకులబోరు వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు పి.సత్యనారాయణ, కె.పెంటయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులను అణగతొక్కుతూ పాలన సాగిస్తోందన్నారు. సీపీఎం నాయకులు పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు, ప్రసన్న, ఎస్.లలిత, ముత్తమ్మ, రేణుక భద్రమ్మ, రవీంద్ర పాల్గొన్నారు.

తాడికోట రోడ్డు తొలగించే యత్నాలు మానుకోవాలి

● ఆదివాసీ సంఘం నాయకులు

వై.రామవరం, ఫిబ్రవరి 16: ఇటీవల మండలంలోని మారుమూల ప్రాంతం తాడికోట గ్రామానికి వేసిన మట్టిరోడు రిజర్వు ఫారెస్టు అం టూ రోడ్డును తొలగించేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, పర్యావరణ పరిరక్షణ అధ్యక్షుడు మడిగొంట వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు. గ్రామంలో గిరిజనేతర రైతుకు వందలాది ఎకరాలు అటవీ భూమి ఉన్నందున ఆ మార్గంలో గత సంవత్సరం డిసెంబరులో జేసీబీతో రోడ్డు వేయించారని దీంట్లో పరోక్షంగా ఫారెస్టు అధికారుల ప్రమేయం ఉందన్నారు. తనిఖీల పేరుతో డీఎఫ్ఓ, రేంజ్ అధికారులు అక్కడ రైతులను బెదిరించి రిజర్వు ఫారెస్టులో ఉన్న రోడ్డును తొలగిస్తామని, అలాగే ఆర్‌వోఎఫ్ఆర్ చట్టాలను రద్దు చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు రావాలంటే డోలీలు కట్టుకుని వెళ్లాల్సిన దుస్థితిఉందని రోడ్డు మార్గం వేయడంతో వాళ్లకి ఎంతో ఉపయోగమన్నారు. ఇప్పుడు వేసిన రోడ్డును తొలగించేందుకు ప్రభుత్వంలో ఓ భాగమైన అటవీ శాఖ ప్రయత్నించడమేమిటని ప్రశ్నించారు. రోడ్డును యథావిధిగా ఉంచా లని లేదంటే ఆదివాసీ సంఘాలు ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

టీడీపీ- జనసేన గెలుపును ఆపలేరు : మాజీ ఎమ్మెల్యే వంతల


జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజేశ్వరి

ఎటపాక, ఫిబ్రవరి16: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ- జనసే న గెలుపును ఎవరూ ఆపలేరని, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. కన్నాయిగూడెం, చింతలగూడెం, వీరాపురం, గట్టుగూడెం, పిచుకలపాడు గ్రామాల్లోని వైసీపీ, ఇతర పార్టీలకు చెందిన 112 కుటుంబాలు శుక్రవారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి నెట్టిందని, తిరిగి రాష్ట్రం గాడిన పడాలంటే టీడీపీ గెలుపు చారిత్రక అవసరమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, అరకు పార్లమె ంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్, తెలుగుయువత రాష్ట్రప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, జనసేన మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్, టీ డీపీ మండల ప్రధానకార్యదర్శి గొల్లపల్లి అప్పలస్వామి, బుల్లెబ్బాయి పాల్గొన్నారు.

టీడీపీలోకి 152 వైసీపీ కుటుంబాలు

చింతూరు, ఫిబ్రవరి 16: ఏడుగురాళ్లపల్లిలో వైసీపీకి చెందిన 152 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి తెలిపారు. విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏడుగురాళ్లపల్లిలో 40 ఏళ్లలో టీడీపీ జెండా ఎగిరిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటివరకు ఆ గ్రామంలో టీడీపీయేతర పార్టీలు మాత్రమే ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రతి పల్లెలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు. ఈ క్రమంలో ఏడుగురాళ్లపల్లి, కాటుకపల్లి, మద్దిగూడెంలో వైసీపీకి చెందిన 152 కుటుంబాలు టీడీపీలో చేరాయని చెప్పారు. తుర్రం తమ్మయ్య, సవలం గంగరాజు, సున్నం జోగయ్య సమక్షంలో ఆయా కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్ వారిని పార్టీలోకి ఆహ్వానించినట్లు చెప్పారు.

అక్రమ అరెస్టుల పర్వం దారుణం

కూనవరం, ఫిబ్రవరి 16: ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతంగా పోరాటాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకుల అక్రమ అరెస్టు దారుణమని యూటీఎఫ్ మండల కార్యదర్శి పాయం కన్నారావు అన్నారు. ఈనెల 18న ఏపీసీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చలో విజయవాడ ధర్నాకు పిలుపునిచ్చారని ఈ కార్యక్రమంలో పాల్గొనవద్దంటూ ఎటువంటి అనుమతులు లేవంటూ యూటీఎఫ్ నాయకులకు పోలీసు నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు శాంతియుతంగా విధులు నిర్వహిస్తూ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసేటట్లు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బాలు

రంపచోడవరం, ఫిబ్రవరి 16: అల్లూరి సీతారామరాజు జిల్లా విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సభ్యునిగా ఏపీ హ్యూమన్ రైట్‌వాచ్ అధ్యక్షుడు బాలు అక్కిన నియమితులయ్యారు. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. షెడ్యూల్ కులాలు, తెగలు హక్కులను కాపాడుతూ వారి హక్కులపై ప్రచారం చేసినందుకుగాను ఆయనను సభ్యునిగా నియమించారు. ఆయన నియామకం పట్ల సీనియర్ దళిత నాయకులు దండంగి సింహాద్రి, రమణ, మాదే రామచంద్రరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మధు చందనకు కాంస్య పతకం

చింతూరు, ఫిబ్రవరి 16 చింతూరుకు చెందిన గుత్తుల మధుచందన మరో పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. బీహార్‌లోని పాట్నాలో ఈనెల 13నుంచి 16 వరకు అండర్-17 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈక్రమంలో అల్లూరి జిల్లా చింతూరు కస్తూర్బాలో చదువుతున్న మధుచందన ప్లస్ 81 విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించింది. కోచ్ గంగాధర్‌కు, మధుచందనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా వారాహి విగ్రహ ప్రతిష్ఠ

అడ్డతీగల, ఫిబ్రవరి16: అడ్డతీగల మండలం వెదురునగరం సమీపంలోని శివసాయి భువనేశ్వరి ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం వారాహి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సాయిరామ్ గురూజీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ పూజల అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారంరాత్రి జాతర కార్యక్రమం ఏర్పాటుచేశామని సాయిరామ్ గురూజీ తెలిపారు.

ప్రసూతి శిశు ఆరోగ్య భవనం ప్రారంభం

రంపచోడవరం, ఫిబ్రవరి 16: స్థానిక ఏరియా ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన ప్రసూతి శిశు ఆరోగ్య భవనాన్ని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి, ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై కొబ్బరి ముక్కలు ఎండబెట్టారని
టీడీపీ కార్యకర్త నిర్బంధం

● వైసీపీ పెత్తందార్ల అడ్డాలుగా పోలీసుస్టేషన్లు
● పోలీసుస్టేషన్‌వద్ద బైఠాయించిన నల్లమిల్లి


అనపర్తి పోలీస్‌స్టేషన్‌వద్ద బైఠాయించి నిరశన తెలుపుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 16 : ఇంటి బయట కొబ్బరి ముక్కలు ఆరబెట్టుకోవడం అవి ఎవరూ తొక్కకుండా మోటారు సైకిల్ అడ్డుపెట్టడమే నేరంగా అతనిని ఆఘమేఘాలపై పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సంఘటన అనపర్తి మండలం దుప్పలపూడిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం దుప్పలపూడి గ్రామానికి చెందిన పెనుమచ్చ రామకృష్ణ టీడీపీ సానుభూతి పరుడిగా ఉన్నాడు. అయితే గురువారం ఆయన ఇంటివద్ద కొబ్బరి కాయలు కొట్టుకుని నూనె ఆడించేందుకు ముక్కలను రోడ్డుపై ఎండబెట్టుకున్నాడు. అదేరోజున కొందరు కావాలని కొబ్బరి ముక్కలపై నుంచి మోటారు సైకిళ్లు నడపడంతో శుక్రవారం ఎండబెట్టిన ముక్కలు తొక్కకుండా మోటార్ సైకిల్ అడ్డుపెట్టాడు. దీనికి ఆగ్రహానికి గురైన గ్రామ వైసీపీ నాయకుడు పోలీసులకు ఫోన్‌చేయడం వెంటనే కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని రామకృష్ణను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రామకృష్ణను తీసుకురావడంపై సిబ్బందిని ప్రశ్నించారు. కొబ్బరి ముక్కలు రోడ్డుపై ఆరబెట్టుకోవడం పెద్ద నేరమేమీకాదని వైసీపీ నాయకుల ఫోన్‌కాల్‌కు స్పందించి వెంటనే స్టేషన్‌కు తీసుకువచ్చి నిర్బంధించడం ఏమిటంటూ సీఐ శివగణేష్‌ను ప్రశ్నించారు. అయినప్పటికీ పోలీసులు వైసీపీ నేతల ఒత్తిడితో రామకృష్ణ చేసింది తప్పని వాదించడంతో పోలీసుల తీరుకు నిరశనగా రామకృష్ణారెడ్డి స్టేషన్‌వద్ద పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించి నిరశన తెలిపారు. దీంతో సీఐ శివగణేష్ రామకృష్ణారెడ్డితో చర్చించి రామకృష్ణను బయటకు పంపడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వీరిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరస పల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, చిన్నం వీర్రాఘవరెడ్డి, దత్తుడు శ్రీను, బాసి, కర్రి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలను ఎదిరించడం గూండాయిజం అంటారా

వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను తెలుగుదేశం పార్టీ ఎదిరిస్తుందని దీనిని ఎమ్మెల్యే భాషలో గూండాయిజం అంటారా అని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం అనపర్తి మండలం రామవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం గ్రామంలో ప్రారంభోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యేచేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. నియోజకవర్గంలో ఎవరు గూండాయిజం చేస్తున్నారో ప్రజలకు తెలుసునన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, అశోక్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, జీవీ పాల్గొన్నారు.

నిరాశ, నిస్పృహలకు నిలువుటద్దం నాల్గో రాజధాని అంశం

బిక్కవోలు: ఈరోజు వైసీపీ నిరాశ, నిస్పృహలకులోనై నాల్గో రాజధానిగా హైదరాబాద్‌ను రెండేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంచాలనే ప్రతిపాదన తీసుకురావడం ఇందుకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన బిక్కవోలు పార్టీ కార్యాలయంలో దేశం నేతలతో సమావేశం జరిపారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు సమాయత్తం కావాలని, బూత్‌లవారీగా భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం త్వరతగతిన పూర్తి చేయాలని, కుటుంబ సాధికార సారథులను ప్రతి 60 మంది ఓటర్లకు నియమించాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, చింతా శ్రీనివాసరెడ్డి, కనుమూరి సాయిరాజు, కుమార్, సింగారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీరాజాపురంలో భవిష్యత్తుకు గ్యారంటీ

రంగంపేట : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మీ కోరారు. శుక్రవారం రంగంపేట మండలం ఎస్టీ రాజాపురంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, మహాశక్తి కార్యక్రమంలో పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ గ్రామంలో ఇంటింటికి తిరగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, అడబాల వెంకటరావు, ఎస్టీరాజాపురం గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాక్షస పాలన నుంచి విముక్తి కల్పించండి: జ్యోతుల


వైసీపీ నుంచి టీడీపీలోకి చేరినవారితో నెహ్రూ

గోకవరం, ఫిబ్రవరి 16: వైసీపీ రాక్షస పాలన నుంచి రాబోయే ఎన్నికల్లో రాష్ట్రానికి విముక్తి కల్పించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని అచ్యుతాపురంలో సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి నెహ్రూ సమక్షంలో శుక్రవారం టీడీపీలోకి చేరారు. వీరందరికీ ఆయన పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నెహ్రూ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటైన అచ్యుతాపురంలో ఇపుడుకిప్పుడు ఎన్నికలు పెడితే టీడీపీకి భారీ మెజార్టీ వస్తుందన్నారు. టీడీపీలోకి చేరినవారిలో చౌటపల్లి కామరాజు, కోలాచక్రం, కొత్తపల్లి బలరామయ్య, శంఖ వెంకన్నబాబు, అత్తిలి ఆదినారాయణ, చిటికిన దుర్గాప్రసాద్, బత్తుల ఈశ్వరుడు, కృష్ణ, యర్వాకుల సుబ్బారావు, కొత్తపల్లి లక్ష్మీనారాయణ, చోడసాని కనకం, అత్తిలి ఆదినారాయణ, ఉన్నారు.

టీడీపీలో చేరికలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16: తెలుగుదేశం పార్టీ విధివిధానాలు నచ్చి భారీగా పార్టీలోకి కార్యకర్తలు చేరుతున్నారని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 50వ డివిజన్‌లో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మరుకుర్తి రవియాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాలు వీరపనేని భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వంక చిన్ని, వంజరపు భరత్ కుమార్‌తో పాటు సుమారు 50 మంది టీడీపీలో చేరారు. వారిని కండువాలతో పార్టీలోకి శ్రీనివాస్ ఆహ్వానించారు. ఇటీవల 37, 38, 47 డివిజన్లలో అత్యధికంగా టీడీపీలో చేరికలు జరిగాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరుతున్న వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

ఉద్యోగులను దగా చేసిన ప్రభుత్వం

● కొనసాగుతున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల నిరసన కార్యక్రమం


పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల నిరసన శుక్రవారం కొనసాగింది. పంచాయతీరాజ్, మున్సిపల్, ఈఎస్ఐ, ట్రెజరీ, ఎస్‌కేవీటీ కళాశాల తదితర కార్యాలయాల్లో ఉద్యోగులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులను, ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా మోసం చేస్తూ కాలం గడిపిందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు సుమారు రూ.23,500 కోట్లు బకాయి పడిందన్నారు. వీటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పింఛనుదారుల సంఘం నాయకుడు కేజీకే మూర్తి మాట్లాడుతూ పింఛనుదారుల విషయంలోనూ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఈనెల 20న జిల్లా కేంద్రం కాకినాడలో జరిగే ధర్నాను, 27న చలో విజయవాడ కార్యక్రమంలోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేణుమాధవ్, నగర ఎన్జీఓ సంఘం నాయకులు అనిల్‌కుమార్, మాధవరావు, 4వ తరగతి ఉద్యోగ సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

జేఏసీ ఆందోళనలో భాగంగా శనివారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని సుబ్బారావునాయుడు, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులు పాల్గొని నిరసన తెలపాలని కోరారు.

సీటీఆర్ఐలో రైతు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 16: రాజమహేంద్రవరం సిటీఆర్ఐలో శుక్రవారం సీఎస్ఐఆర్-సీఐఎంఏపీ ప్రాంతీయ పరిశోధనస్థానం హైదరాబాద్ వారు ఐసీఏఆర్- ఎన్ఐఆర్‌సీఏ కృషివిజ్ఞాన కేంద్రం కలవచర్ల సౌజన్యంతో ఔషధ, సుగంధ మొక్కల పెంపకం, ప్రాథమిక ప్రాసెసింగ్, నాణ్యత, విలువ జోగింపు, మార్కెటింగ్ అంశాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ పరిశోధన కేంద్ర హైదరాబాద్ శాస్త్రవేత్త జె.కోటేష్ కుమార్, సీనియర్ ప్రిన్సిపల్ సెంటిస్ట్ జి.కిరణ్‌బాబు, చీఫ్ సైంటిస్ట్ కేవీఎన్ సత్యశ్రీనివాస్, శాస్త్రవేత్తలు కేవీకే అధికారులు, ఎఫ్‌పీవో సభ్యులు, రైతులు, ఏపీ సీఎన్ఎఫ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. సుగంధ ఔషధ మొక్కల ఉత్ప త్తులు విలువ, గ్రేడింగ్, మార్కెంటింగ్‌పై అవగాహన కల్పించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం జిల్లాలో 10వేల హెక్టార్లలో సాగవుతుందని వివరించారు. ఈ పంటల వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. నిమ్మగడ్డి రూట్, కట్టింగ్స్, పామరోజా విత్తనం సుగంధ తైలాలను, అశ్వగంధ విత్తనాన్ని శాంపిల్ కిట్స్ రైతులకు ఉచితంగా అందించారు. సదస్సులో వివిధ మండలాల నుంచి అభ్యుదయ రైతులు, కేవీకేస్టాఫ్ సత్యవాణి, దిలీప్, రాజు, విజయవర్ధన్, ప్రభాత్‌నాయుడు, ఆర్.రత్నాజీ పాల్గొన్నారు.

వైభవంగా త్రిశూల స్నాన మహోత్సవం



ధవళేశ్వరం, ఫిబ్రవరి 16: బాలాత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిశూల స్నాన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లతోపాటు త్రిశూలాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. అనంతరం రామపాదాల స్నాన ఘాట్‌వద్ద స్వామి అమ్మవార్లు త్రిశూలాన్ని ఆలయ అర్చకులు విశ్వనాథశర్మ, చిన్నశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరిలో త్రిశూల స్నానం నిర్వహించారు.

'గోదావరి స్నానఘట్టాలను శుభ్రం చేయాలి'

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16: మహాశివరాత్రి పర్వదినం దగ్గర పడుతున్నందున గోదావరి స్నానఘట్టాలను శుభ్రం చేయాలని గోదావరి పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. దీనిపై ఇప్పటికే కమిషనర్‌ను కోరామని చెప్పారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఏపీ పేపర్‌మిల్లు ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణసాయి కల్యాణ మండపంలో రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల తెలుగుభాషా సేవారత్న పురస్కారాన్ని పొందిన కమిటీ కన్వీనర్ కృష్ణకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కర్రి రామారెడ్డి, కేకే సంజీవరావు పాల్గొన్నారు.

'దేశానికి మూడో తరం రాజకీయం అవసరం'

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 16: స్వాతంత్ర భారతదేశంలో ఇప్పుడు మూడోతరం రాజకీయ పార్టీ అవసరమని అందుకోసం పరివర్తన్ ఇండియా పార్టీని ఏర్పాటు చేస్తున్నానని ఆ పార్టీ నేత మరీది గంగాధరరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం కృషి చేస్తామన్నారు. రాజమహేంద్రవరం నుంచి పార్లమెంట్‌కు పోటీచేస్తున్నానన్నారు.

గ్రామీణ బంద్ విజయవంతం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16: జిల్లాలో గ్రామీణ బంద్ విజయవంతమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్, పెరవలి, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏఐటీయూసీ తదితర వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్యాంకులు, పోస్టాఫీసుల బంద్ నిర్వహించి ర్యాలీలు నిర్వహించామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సుబ్బారావు నగర్‌కి చెందిన తుమ్మల లోవరాజు సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తల్లి లక్ష్మీ ఫిర్యాదుతో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ కేసు నమోదు చేశారు. గామన్ బ్రిడ్జిపై ఎదురుగా వెళ్తున్న లారీ డ్రైవరు అకస్మాత్తుగా బ్రేకు వేయడంతో వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక వస్తున్న లారీ డ్రైవరుకు గాయాలయ్యాయి. డ్రైవరు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

లే ఆఫ్ ఎత్తివేసి ఉద్యోగ భద్రత కల్పించాలని దీక్ష

బిక్కవోలు, ఫిబ్రవరి 16: బలభద్రపురం శివారు కానేడులో వున్న బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విధించిన లేఆఫ్‌ను ఎత్తివేసి, ఉద్యోగ భద్రత కల్పించి, ఉత్పత్తిని ప్రారంభించాలంటూ కార్మికులు శుక్రవారం బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా కార్మిక సంఘ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం అక్రమ లేఆఫ్ పేరుతో పరిశ్రమలో ఉత్పత్తిని నిలుపుదలచేసి 30 శాతం జీతం ఇస్తూ గత 80 రోజులుగా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ దీక్షలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. కార్మిక నేతలు రాంబాబు, వెంకటరమణ, సీఐటీయు నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

'అన్నదాతలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం'

రాజానగరం, ఫిబ్రవరి 16: అన్నదాతలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలంచెందాయని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు ఆరోపించారు. దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణబంద్ సందర్భంగా రాజానగరంలో ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో రాజానగరంలోని గాంధీబొమ్మసెంటర్‌లో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ ప్రజా సంఘాలతో కలిసి స్థానిక అన్నదానసత్రం నుంచి ప్రదర్శనగా బయలుదేరి గాంధీ బొమ్మసెంటర్ వద్ద నిరసన తెలిపారు. మరుకుర్తి వీరలక్ష్మీసత్యవతి, దొమ్మ సీత, దుర్గ,బేబీ, గౌరీ, లక్ష్మి, జి.వసంత్ పాల్గొన్నారు.

ఐఎస్‌టీఎస్‌లో సిద్దార్థ రాయ్ సినిమా సందడి



ఐఎస్‌టీఎస్ కళాశాలలో సందడి చేస్తున్న హీరో దీపక్ సరోజ్

రాజానగరం, ఫిబ్రవరి 16: శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ సమర్పణలో యశస్వి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సిద్దార్థరాయ్ మూవీ ప్రమోషన్ తో తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సందడి నెలకొంది. సినిమా హీరో దీపక్ సరోజ్, హీరోయిన్ తన్వి, కీర్తన కళాశాల విద్యార్థినులతో కలిసి ఆడుతూ పాడుతూ అందరినీ అలరించారు. ఈసందర్భంగా హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ యువకథా భరితంగా రూపుదిద్దుకున్న ఈసినిమా మంచి కామెడీతోపాటుగా యూత్‌ఫుల్ లవ్‌స్టోరీగా తీశామని సినిమాలోని డైలాగ్స్‌తో డ్యాన్స్ చేయించారు. తొలుత సినీనటులకు ఐఎస్‌టీఎస్ కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, ఏవో ఇక్బాల్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టిలంకలో మస్‌జిద్ నిర్మాణం జరుగుతుంది: ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఫిబ్రవరి 16: పొట్టిలంకలో మస్‌జిద్ నిర్మాణం జరుగుతుందని అందుకోసం తన సంపూర్ణ మద్దతు ఉం టుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల టీడీపీ నాయకులతో కలిసి పొట్టిలంక మస్‌జిద్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూర్‌భాషా సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్, ముస్లిం నాయకులు మస్‌జిద్ నిర్మాణ సమస్యను ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి తీసుకెళ్లారు. పొట్టిలంక గ్రామంలో మస్‌జిద్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆరిఫ్ ప్రయత్నిస్తున్నారని, రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులచే స్థానిక ముస్లిం నాయకులపై కక్షసాధింపు నోటీసులు ఇప్పిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మస్‌జిద్ నిర్మాణానికి ఆటంకాలు సృష్టించవద్దని ఎమ్మెల్యే గోరంట్ల అధికారులతో మాట్లాడారు. మస్‌జిద్ నిర్మాణం తప్పక జరుగుతుందని ముస్లిం నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, రాష్ట్ర టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనువాసు, ముస్లిం నాయకులు సయ్యద్ ఉమర్, షేక్ నానాజీ, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీరామ్, వాసా శ్రీనివాస్, కలిదిండి సత్యనారాయణ, షేక్ చిన్నారి తదిరులు ఉన్నారు.

మసీదు నిర్మాణాన్ని అడ్డుకోవడం దారుణం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16: కడియం మండలం పొట్టిలంక గ్రామంలో మసీదు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆరీఫ్ ప్రయత్నించడం దారుణమని టీడీపీ మైనార్టీ సెల్ రూరల్ అధ్యక్షుడు సయ్యద్ ఉమర్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైనార్టీలకు అన్యాయం చేస్తున్నా ఆ పార్టీలో ఉన్న మైనార్టీలు కూడా స్పందికపోక వత్తాసుపలుకుతున్నారని ఆరోపించారు. మసీదు నిర్మాణాలకు నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడమే కాకుండా అసలు అనుమతులు ఇవ్వడానికి కూడా ముందుకు రావడం లేదన్నారు. షేక్ సుభాన్ ముస్లింలు మసీదు నిర్మాణం చేసుకోవాడానికి నిధులు సమకూర్చారని, ఇప్పుడు దాన్ని ఆరీఫ్ నిలుపుదల చేయాలని లేఖలు రాసినట్టుగా అధికారులు చెబుతున్నారంటే ఇంతకంటే దుర్మార్గం వుంటుందా అని ప్రశ్నించారు.

మూడో రోజు తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు

గోకవరం, ఫిబ్రవరి16: మండలంలోని తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు శుక్రవారంనాటికి మూడోరోజుకు చేరుకున్నాయి. రథసప్తమి సందర్భంగా కొండపై గ్రామస్తులచే సామూహిక పాలు పొంగించే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే గోక్షీరాభిషేకం, పాయశోత్సవం, నిత్యోపాశన, మహాశాంతి, సూర్యనమస్కా రములు, సహస్రదీపాలంకరణసేవ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తంటికొండ కొండపై జరుగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు గతవైభవాన్ని కోల్పోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానం నిర్వాహకులు ఉత్సవాలు గురించి సరైన ప్రచారం చేయకపోవడం, దీనికితోడు అరకొర సౌకర్యాలతో భక్తులు అంతంతమాత్రంగానే హాజరవుతున్నారు.

రథ సప్తమి వేడుకలు

రాజమహేంద్రవరం, కల్చరల్ ఫిబ్రవరి 16: రథ సప్తమి సంద ర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార భవిష్యత్తు రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకాశం నగర్ శ్రద్ధ స్మార్ట్ స్కూల్లో విద్యార్థులతో యోగా గురువు తీడా రాముతో సూర్య నమస్కారాలు నిర్వహించారు. కార్యక్ర మంలో ధర్మ ప్రచార భవిష్యత్తు ప్రోగ్రాం అసిస్టెంటు ఒ.నరసింహయోగి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు పంపిణీ

ధవళేశ్వరం, ఫిబ్రవరి 16: టీడీపీ హయాంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న వడ్డెరకాలనీ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు శుక్రవారం అంద జేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సీహెచ్ వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎం.షర్మిలారెడ్డి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, గూడూరి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ఇళ్లు ఖాళీగా ఉండ టంతో తలుపులు, కిటికీలు పాడైపోయాయని ఇళ్లను బాగుచేసి మంగళవారం నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని ఎంపీ భరత్ తెలిపారు. అనంతరం కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లతాళాలు అందజేశారు. కార్యక్రమంలో అడపా శ్రీహరి, నక్కా శ్రీగణేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోం ఉద్యోగం పేరుతో..
రూ.4.08 లక్షల దోపిడీ 8
రేపు నిడదవోలులో
దళితుడా రా.. కదలిరా





సూర్యదేవాయ నమః

రథసప్తమిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సూర్యభగవానుడికి నమస్కరించి ప్రత్యేక పూజలు చేశారు. నిడదవోలులో భక్తజనం ఇలా చేతులెత్తి మొక్కారు.



మూడో రోజు.. నిరసనల హోరు

ఉద్యోగులు మూడో రోజు నిరసనలతో హోరెత్తించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు విధులకు ఆటంకం కలగకుండా జిల్లా వ్యాప్తంగా భోజన విరామ సమయంలో శుక్రవారం మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు.ధవళేశ్వరం నీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద ఇరిగేషన్ ఉద్యోగులు ధర్నా చేశారు. - ధవళేశ్వరం

బంద్ విజయవంతం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16 : బీజేపీ ప్రభుత్వ వినాశనకర విధానాలకు నిరసనగా దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణభారత్ బంద్ విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ చేశారు. కార్మికులు, రైతులకు అన్యాయం చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోదీ నాయకత్వంలోని బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గద్దె దింపాలని పలు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు సెంటర్లోని హెడ్ పోస్టాఫీసు నుంచి శ్యామలా సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా కోటగుమ్మం సెంటర్ వరకూ కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ చేసి అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఏవీ రమణ మాట్లాడుతూ గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు దోచిపెట్టారని విమర్శించారు.బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజల పట్ల తీవ్రమైన నిరంకుశత్వం ప్రదర్శించిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చిన మోదీ మాట నిలబెట్టుకోకుండా రైతు చట్టాల పేరుతో వారి భూములను లాక్కుని కార్పొరేట్లపరం చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొండలరావు, నల్ల రామారావు, రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జోజి, ఎస్ఎఫ్ఐ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం తేవాలి

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆమె స్వీప్ నోడల్ అధికారులతో సమీక్షించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్(స్వీప్) ఓటర్ల వద్దకు చేరాలన్నారు. ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించడానికి భారత ఎన్నికల సంఘం ఈస్వీప్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. యువ ఓటర్ల నమోదుపై మరింత దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, డీఈవో కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ అధికారి ఎస్.సుభాషిణి, ఆర్ఎంసీ వైద్య అధికారి డా.వి.వినూత్న, డిప్యూటీ డీఈవో ఈ.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



టిక్కెట్..టెన్షన్!

అభ్యర్థుల ఎదురుచూపులు

ఒక పక్క జనం.. మరో పక్క నాయకులు ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయోనని ఎదురుచూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌పై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎక్కడ చూసినా అదే చర్చ సాగుతోంది. మరో పక్క ఇంకా టిక్కెట్లు ఖరారు కాక పోవడంతో అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- ఇంకనూ ఖరారు కాని సీట్లు
- అయోమయంలో అభ్యర్థులు
- టీడీపీ- జనసేన పొత్తుతో ఆలస్యం
- జిల్లాలో 7 అసెంబ్లీ, 1 ఎంపీ సీటు
- టీడీపీ నుంచి ముగ్గురికి గ్రీన్‌సిగ్నల్?
- రాజానగరం జనసేనకే..
- రాజమహేంద్రి ఎంపీ సీటెవరిదో
- వైసీపీలో 3 సీట్లు పెండింగ్

సార్వత్రిక ఎన్నికలకు ఇంకెంతో దూరం లేదు. ఈ నెలలోనే షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. షెడ్యూల్ వచ్చిన తర్వాత 60 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందనే వాదన ఉంది.అంటే ఏప్రిల్ మూడు, నాలుగు వారాల్లో ఎన్నికలు జరగవచ్చు. అయితే రాజకీయ పార్టీలు ఇంకా పూర్తిస్థాయిలో తమ అభ్యర్థులను ఖరారు చేయలేదు. తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తు వల్ల కొన్ని స్థానాల్లో కొందరు నేతలు త్యాగం చేయకతప్పని పరిస్థితి ఉంది. మరో వైపు బీజేపీ, జనసేన పార్టీలతో బీజేపీ కూడా జత కట్టనుందనే సమాచారం ఉంది. దీంతో మరింత త్యాగం చేయాల్సి ఉంటుంది. ప్రజావ్యతిరేక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా అందరూ ఐక్యంగా ఉంటూ, అధికారంలోకి రావాలనే కోరికతో టీడీపీ-జనసేన ఉన్నాయి.వాటికి బీజేపీ తోడు కానుంది. టీడీపీ-జనసేనతో కలిసి వచ్చేందుకు వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయి.కానీ టీడీపీ -జనసేన పార్టీలు బీజేపీతో పొత్తు పెట్టుకుంటారనే సమాచారం వామపక్షాలకు ఇబ్బందిగా మారింది. కానీ గతంలో ఎన్టీఆర్ ఒకవైపు బీజేపీతో స్నేహసంబంధాలు పెట్టుకుని,వామపక్షాలనుకలుపుకున్నారని,ఈసారి వామపక్షాలతో కూడా టీడీపీకి పొత్తు ఉంటుందనే ప్రచారం ఉంది.ఈ పరిస్థితుల్లో పొత్తులు, సామాజిక వర్గాలను సమన్వయ పరచుకుంటూ టికెట్లను ఖరారు చేయాల్సి వస్తోంది.

ఇంకా తేలని అభ్యర్థిత్వం..

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానం ఉన్న సంగతి తెలిసిందే. తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తులు ఖరారైనప్పటికీ..ఎవరు ఎక్కడ పోటీచేస్తారు.. అక్కడ అభ్యర్థులెవరనేది అనేది ఇంకా ఖరారు కాలేదు. కానీ జిల్లాలో తెలుగుదేశం అధిష్ఠానం ముగ్గురికి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు చెబుతున్నారు. గోపాలపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు, రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్లను దాదాపు ఖరారు చేసినట్టు చెబుతున్నారు. రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక్కడ నుంచి జనసేన టికెట్ బత్తుల బలరామకృష్ణ ఆశిస్తున్నారు. కానీ ఇక్కడ తనకే టికెట్ వస్తుందని టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి వాదిస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తిరిగి టికెట్ తనదేనని చెబుతుండగా, తనదేనని జనసేన నేత, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ అంటున్నారు. శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఇంకా ఎవరికీ టికెట్లు ఖరారు కాలేదని, తెలుగుదేశం అభ్యర్థులను తమ అధినేత చంద్రబాబు, జనసేన అభ్యర్థులను పవన్‌కల్యాణ్ ప్రకటిస్తారని చెప్పడం గమనార్హం. కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గంలో కూడా టీడీపీ టికెట్ ఎవరిదనేది తేలలేదు. మాజీ మంత్రి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కెఎస్.జవహర్ టికెట్ కోసం తీవ్రంగా పట్టుపడుతున్నారు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావును ఇక్కడ నుంచి బరిలో దించడానికి మరో వర్గం ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. వీరిద్దరూ కాకుండా మరో 8 మంది కొవ్వూరు టిక్కెట్ కోసం పోటీపడడం గమనార్హం. నిడదవోలులో పోరు రసవత్తరంగా ఉంది. ఇక్కడ నుంచి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్యనారాయణ టికెట్ కోసం పోటీ పడుతున్న సంగతి తెలిసిందే.ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నట్టు కూడా ప్రచారం ఉంది. ఎందుకంటే గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో జనసేనకు 20 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జిల్లాలో టికెట్ల ఖరారు ఇంకా పూర్తి కాకపోవడంతో ఆశావహుల్లో టెన్షన్ పెరుగుతోంది. బీజేపీ జతకడితే రాజమహేంద్రవరం ఎంపీ సీటు కేటాయించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఫ్యాన్‌లో.. ఆ మూడెవరికోసమో..

వైసీపీ ఇప్పటికే నలుగురిని నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా ప్రకటించింది. వారంతా ప్రస్తుత ప్రజాప్రతినిధులే అయినప్పటికీ వారి స్థానాల నుంచి మరో స్థానాలకు బదిలీ చేయడం సమస్యగా మారింది. వీరిలో ఇద్దరు మంత్రులు ఉండడం గమనార్హం. గత ఎన్నికల్లో వారిని ఎన్నుకున్న ప్రజలకు సేవ చేయకుండా, ఆయా నియోజవర్గాలను వదిలేసి కొత్తవాటిలో ఓట్లకు తంటాలు పడుతున్నారు.వైసీపీ ఇంకా అనపర్తి, రాజానగరం, నిడదవోలు ఎమ్మెల్యేల విషయంలో స్పష్టత ఇవ్వవలసి ఉంది. ఇంకా స్పష్టత రాక వీరినీ టెన్షన్ పీడిస్తోంది.

కాంగ్రెస్‌లో జోష్

వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా పగ్గాలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. ఆమె జిల్లాలో కూడా పర్యటించారు. తన అన్న సీఎం జగన్ వైఖరిని తూర్పారబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం పెరుగుతుందనే చర్చ మొదలైంది. ఈ పరిస్థితుల్లో ఈసారి కాంగ్రెస్ కూడా ఎన్నికల్లో పోటీ చేయనుంది. ఇప్పటికే టికెట్లు ఆశించేవారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.ఇదిలా ఉండగ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌ఠాగూర్ 29న టిక్కెట్లపై స్పష్టత ఇస్తామని ప్రకటించారు.



భోజనం ఎలా ఉందమ్మా?

విద్యార్థినిని ప్రశ్నించిన ఆర్‌జేడీ నాగమణి

బిక్కవోలు, ఫిబ్రవరి 16: పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల ఆర్‌జేడీ జి.నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. ఊలపల్లి ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, టాబ్స్, ఐఎఫ్‌బీలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినితో మాట్లాడి భోజనంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి ఉన్నారు.

ధవళేశ్వరంలో ముస్తాబవుతున్న రథం



20న జనార్దనుడి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి16 : ధవళేశ్వరం జనార్దన స్వామి రథోత్సవాన్ని ఈ నెల 20వ తేదీన వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఆలయ అర్చకులు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని మూడు సార్లు ప్రదక్షణగా తిప్పి తూర్పు ముఖంగా నిలిపి ఉంచారు.రథాన్ని దర్శించుకునేందుకు భక్తజనం తరలివచ్చారు. శనివారం నుంచి స్వామి వారి రథాన్ని ముస్తాబు చేసే పనులు ప్రారంభిస్తారు.



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామి

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆరంభం

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారికి వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం స్వామి వారి నూతన రథానికి పూజలు నిర్వహించారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు. శ్రీకర, శుభకర, ప్రణవ స్వరూపుడైన ఆది దేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా తీర్చిదిద్దారు. స్వామివారు ఉదయం సూర్య వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.26వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఎస్ జవహర్

సినిమా చూపిస్తే భయమెందుకు?

రాజధాని ఫైల్స్ సినిమా అడ్డుకోవడంపై జవహర్ ఆగ్రహం

కొవ్వూరు, ఫిబ్రవరి 16 : రాజధాని అమరావతి విధ్వంసంపై రాజధాని ఫైల్స్ సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించడంతో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి భయపడుతున్నారని అందుకే సినిమాను ప్రజల చెంతకు చేరకుండా అడ్డుకుంటున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ అన్నారు. కొవ్వూరు నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని ఫైల్స్ సినిమా చూసి వైసీపీ నాయకులకు చెమటలు పడుతున్నాయన్నారు. అధికారంలోకి రావడంతోనే అమరావతి రాజధాని కాదు, మూడు రాజధానుల ముచ్చట తెచ్చి ఐదేళ్లు కాలయాపన చేశారన్నారు. ఓటమి తప్పదని గ్రహించి మాట మార్చి హైదరాబాద్ రాజధాని చేస్తామని చెప్పే పరిస్థితి చూస్తుంటే జగన్మోహనరెడ్డి నిలకడలేని తనం బయట పడుతుందన్నారు. ఈ చిత్రం ద్వారా జగన్మోహనరెడ్డి దుర్మార్గాలను ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు తెలియజేస్తామన్నారు.అమరావతి రైతుల ఘోషతో ఏప్రిల్‌లో జగన్మోహనరెడ్డి దుకాణం బంద్ అవు తుందన్నారు. సినిమా అందరూ చూసి అమరావతి ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు.యనమదల శివరామకృష్ణ ప్రసాద్, నామా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సినిమా అడ్డుకోవడం పిరికిపంద చర్య : గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16: రాజధాని అమరావతి రైతుల ఆవేదనకు రూపంగా వచ్చిన రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవడం పిరికిపంద చర్య అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ,రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఏపీ రాజధాని కోసం 34 వేల ఎకరాలను రైతులు నిస్వార్థంగా ఇచ్చారని అప్పుడు ప్రతిపక్షంలో జగన్ దీనిని స్వాగతిస్తున్నామని ప్రకటించాడన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు పేరుతో డ్రామాలు ఆడాడని మండిపడ్డారు.జగన్ అధికారంలోకి వచ్చాక 276 మంది రైతులను పొట్టన పెట్టుకుని,వేల మంది రైతు కుటుంబాలను రోడ్డున పడేశాడని ధ్వజమెత్తారు.ఈ నేపథ్యంతో రాజధాని ఫైల్స్ సినిమా తీస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు.జగన్ రెడ్డి చిత్రానికి రెవెన్యూ అధికారులు, కలెక్టర్లు దగ్గరుండి కలెక్షన్స్ చూడాలని సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు.



ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే.. వదలొద్దు!

నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదలొద్దని.. అదే సమయంలో ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందికి పోలీస్ ఉన్నతాధికారులు హితబోధ చేశారు. జాంపేట పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లాలోని ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డులకు ఎన్నికల నియమావళిపై శుక్రవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో ఇప్పటికే తర్ఫీదు పొందిన నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు అనసూరి శ్రీనివాస్, రామకృష్ణ(దేవరపల్లి) పీపీటీ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలు వివరించారు. సమస్యాత్మక పోలీస్ స్టేషన్లను గురించి కారణాలను వివరిస్తూ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా నివేదిక సమర్పించాలన్నారు.ప్రజల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని,అనవసరవిషయాల్లో జోక్యం వద్దని సూచించారు.

మెడిసిన్ విద్యార్థులకు ఫ్యామిలీ అడాప్షన్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16 : ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు సమాజంలో నెలకొన్న వివిధ ఆరోగ్యపరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్) డాక్టర్ కేవీ శివప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం వైద్యవిద్యార్థులకు ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఒక్కో వైద్య విద్యార్థికి ఐదు కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్నమాచారి రోడ్డు, దుర్గానగర్, వాంబేకాలనీ పరిధిలోని అర్బన్ ఏరియాల్లోని కుటుంబాలను కేటాయించడం జరుగుతుందన్నారు.

'రాజధాని'పై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ చిత్రాన్ని వైసీపీ గూండాలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఆ సినిమా బృందం కోర్టుకు వెళ్లడంతో హైకోర్టు సినిమా ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వైసీపీకి చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. శుక్రవారం నిడదవోలులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి 33 వేల ఎకరాల భూమిని 28 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ఇవ్వడం చారిత్రాత్మక విషయమని, అలాంటి రైతులపై ప్రస్తుత ప్రభుత్వం పైశాచికత్వం ప్రదర్శించడం, రాజధానిని విధ్వంసం చేయడం అమానుషమన్నారు. ఈ యథార్థ సంఘటనల ఆధారంగా చిత్రీకరించిన రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం శోచనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని జగన్ దిక్కుతోచని పరిస్థితుల్లోనే ఇలా చేస్తున్నాడని బూరుగుపల్లి ఎద్దేవా చేశారు. రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమన్నారు. సమావేశంలో తిరుపతి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సూర్యకాంతం, తన్నీడి బోసు ఉన్నారు.

'ఎలక్టోరల్ బాండ్స్ రద్దు'పై హర్షం

కొవ్వూరు, ఫిబ్రవరి 16: ఎలక్టోరల్ బాండ్స్ రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. సమాచార హక్కు ద్వారా అడిగితే బీజేపీ ఇవ్వలేదని, శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమన్నారు. బీజేపీ ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా సేకరించిన రూ.6 వేల కోట్ల లెక్కలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన సొమ్ము చెల్లించకుండా నల్లధనాన్ని దాచుకునే విధంగా వ్యవహరించడం బాధాకరమన్నారు.

నిడదవోలులో ప్రభుత్వోద్యోగుల నిరసన



నిడదవోలులో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

నిడదవోలు, ఫిబ్రవరి 16: నిడదవోలులోని నీటి పారుదల శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కె.నందేశ్వరుడు మాటాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు తమ పోరాటాన్ని దశలవారీగా మరింత ఉధృతం చేస్తామన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరసన ప్రదర్శనలో అన్ని శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ రాంబాబు, మాణిక్యాలరావు పలువరు ఉద్యోగులు పాల్గొన్నారు.

43వ రోజుకు చేరిన న్యాయవాదుల రిలే దీక్షలు

నిడదవోలు, ఫిబ్రవరి 16: నిడదవోలులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరవధిక దీక్షలు శుక్రవారం 43వ రోజుకు చేరుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు చేస్తున్న దీక్షలకు పలు ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వేగేశ్వరపురం పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ రామారావు, సర్పంచ్ రామారావు

తాళ్లపూడి, ఫిబ్రవరి 16: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ రామారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురం జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం జరగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కొవ్వూరు సబ్ డివిజన్‌లో పర్యటిస్తున్నాని సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని కొవూరు సబ్ డివిజన్‌లో 55 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఆయా సమస్యాత్మక గ్రామాలలో అవగాహన కలిపించడం ద్వారా ప్రజలకు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ శ్రీనివాసరావు, తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్‌సుందర్, గ్రామ సర్పంచ్ కొమిరెడ్డి పరశురామారావు, కార్యదర్శి నాగాంజనేయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

అవగాహన సదస్సులో నల్లజర్ల ఎంపీడీవో నరేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్‌కుమార్

నల్లజర్ల, ఫిబ్రవరి 16: ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి ఎంపీడీవో నరేష్‌కుమార్ సూచించారు. గురువారం నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ నెల 17 నుంచి 29 వరకు అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించే సమయంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వేతనదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఇంటికి సామజిక తనిఖీ చేసే సమయంలో ఫీల్డు అసిస్టెంట్లు ఉండకూడదన్నారు. చివరి వేదనం పడిన తేదీ వరకు జాబ్‌కార్డు అప్‌డేట్ చేసి ఉండాలన్నారు. ఏపీవో జీవీ రమణ మాట్లాడుతూ 2022-23 కాలంలో చేపట్టిన 731 పనులకు సంబంధించి రూ.8,90,82,000 కాగా వేతనదారులకు రూ.7,89,00,000 మెటీరియల్ కాంపోనెట్ రూ.1,08,18,000గా ఉందన్నారు. వీటిపై సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కే తులసీనాయక్, డీఆర్‌పీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

డాక్టర్ సిరాజుద్దీన్.. అచ్చన్నపాలెంలో 'ఆరోగ్య సురక్ష'

నల్లజర్ల, ఫిబ్రవరి 16: ప్రజారోగ్యమే పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం వైద్య బృందం ప్రజలకు వైద్య సేవలు అందిస్తోందని డాక్టర్ మహ్మద్ సిరాజ్‌ఉద్దీన్ అన్నారు. గురువారం అచ్చన్నపాలెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అనారోగ్య సమస్య ఉన్న ప్రతిఒక్కరు ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షించుకుంటే మెరుగైన వైద్యం కోసం తాము వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేస్తామన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో నిలువు దోపిడీ జరుగుతుందని ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని వ్యాధులకు చికిత్సలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, సుమన్, నల్లజర్ల వైద్య సిబ్బంది జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు జయంతి

కొవ్వూరు, ఫిబ్రవరి 16: కొవ్వూరు మండలం సీతంపేటలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని శుక్రవారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి బంగారయ్య, వాడపల్లి ఉప సర్పంచ్ సముద్రం, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పూటి వెర్రిబాబు, సంగీత వెంకటేశ్వరరావు, ఉజ్జిన శ్రీను, మసిరెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు.

కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు
- కార్మిక సంఘాల గ్రామీణ బంద్ విజయవంతం
- బీజేపీ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన
- పలుచోట్ల భారీ ప్రదర్శనలు.. ర్యాలీలు

కొవ్వూరు, ఫిబ్రవరి 16: కార్మికులు అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు గ్రామీణ బంద్ నిర్వహించాయి. దీనిలో భాగంగా కొవ్వూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. సుందరబాబు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయినా రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కార్మికులకు వర్తించే ఈపీఎఫ్ పింఛను రూ.10 వేలకు పెంచడానికి, సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను పునరుద్ధరణకు కేంద్రం వ్యతిరేకంగా నిలిచిందన్నారు. సెంట్రల్ ఉద్యోగులకు 8వ పే కమిషన్ నియమించకుండా జాప్యం చేస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దుకూరి దొరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అసంఘటిత రంగంలో ఉన్న నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధులు ఉన్నప్పటికీ పథకాలను నిలుపుదల చేసిందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, బీర రవి, మైగాపుల నాగేశ్వరరావు, మాణికిరెడ్డి హరిబాబు, కొమ్మన రాముడు, వీరా త్రిమూర్తులు, రంగిశెట్టి రామకృష్ణ, గోడపట్టి శ్రీను, ఎ.శేషారావు, భూపతి రవీంద్ర పాల్గొన్నారు. పంగిడిలో ఐఎఫ్‌టీయూ నాయకుడు పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 44కార్మిక చట్టాలను రద్దుచేసి, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. లారీ ట్రక్కు డ్రైవర్లపై తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్.రమేష్, పీకేఎస్ నాయకులు ఎస్‌కే మస్తాన్, ఏఐసీటీయూ నాయకుడు కస్సే సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకుడు వేమన దుర్గారావు, క్రషర్, లారీ డ్రైవర్ ఆపరేటర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, గంటా కృష్ణ పాల్గొన్నారు.



నిడదవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవరపల్లి: దేవరపల్లిలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ 2014 నుంచి మోదీ ప్రజలను మోసగిస్తూనే ఉన్నారని, ఆత్మ నిర్భర భారత్, స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా వంటి పేర్లతో ప్రచారాలు తప్ప చేసిన అభివృద్ధేమి లేదన్నారు. రైతులు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఉద్యమిస్తుంటే అణచివేయాలని చూడడం దుర్మార్గమన్నారు.



దేవరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘం నాయకులు

దుద్దుకూరులో ప్రగతిశీల కార్మిక సంఘం సమాఖ్య నాయకులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రత్నాజీ, ఉండవల్లి కృష్ణారావు, పాముల శ్రీను, ఆచంట సత్యనారాయణ, మల్లిపూడి వెంకటలక్ష్మి, కే.రాజకుమారి, వరలక్ష్మి, ఆచంట సుభాస్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రేఖా భాస్కరరావు మాట్లాడుతూ నరేంద్రమోదీ సర్కారు కార్పొరేటర్లకు అనుకూలంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందని, దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెడుతోందన్నారు. స్వతంత్ర భారతదేశంలో 14 మంది ప్రధానుల కాలంలో దేశం రూ.57 లక్షల కోట్లు అప్పులో ఉంటే మోదీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో 100 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, ధరల పెరుగుదలను అరికట్టడంలో కేంద్రం విఫలమైందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీని గద్దె దింపి దేశంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో గన్నాబత్తుల సత్యనారాయణ, మొయిలి శ్రీను, రామిశెట్టి సత్తిబాబు, బెజా అప్పారావు పాల్గొన్నారు. సీఐటీయూ, హెచ్‌పీ గ్యాస్ వర్కర్స్ లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్, జైభారత్ ట్యాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ చౌక్ సెంటరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జువ్వల రాంబాబు, టి.బాలస్వామి, వి.కృష్ణ, శ్రీనివాస్, సూరిబాబు, ధనరాజు, హాస్సేన్, డానియేల్ పాల్గొన్నారు.



గోపాలపురంలో బంద్ నిర్వహిస్తున్న రైతు, గిరిజన సంఘాలు



కొవ్వూరులో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

చాగల్లు: చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ వద్ద ప్రజాసంఘాలు, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, రైతు, కౌలురైతు సంఘాలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు హమాలీలు, కార్మిక సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూతపడిన షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలన్నారు. కేంద్రం ప్రజావ్యతిరేక నిధానాలను విడనాడాలన్నారు. రాజధాని లేదు, పోలవరం పూర్తికాలేదు, ఉపాధి కల్పన లేదు, అన్నింటిలోను రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు.



చాగల్లులో నిరసన ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గోపాలపురం: గోపాలపురంలోని బస్టాండ్ సెంటర్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) నాయకులు మేడిసెట్టి అప్పారావు, వెంకటశ్రీరాముల అధ్యక్షతన జరిగిన సభలో ప్రగతి శీల మహిళా సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి కురసం లత మాట్లాడుతూ మోదీ తీసుకొచ్చిన రైతు వ్యతిరేక మూడు చట్టాలకు రైతాంగం ఏడాది పైబడి ఢిల్లీలో ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. ఈ ఉద్యమంలో అనేక మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు మోదీ ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు చేయలేదని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయలేదన్నారు. హరియాణా నుంచి ఢిల్లీ వెళ్లిన రైతులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తోందని, డ్రోన్ల ద్వారా ప్లేలెట్లు, ప్లాస్టిక్ బుల్లెట్లు కురిపిస్తూ, భాష్పవాయువు ప్రయోగిస్తూ ఉద్యమాన్ని అణచివేసేందుకు సతవిధాల ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘాలు పాల్గొన్నాయి.

మందుబాబుల ఆగడాలు

- నిడదవోలులో ప్రయాణికులు, స్థానికులకు తప్పని తిప్పలు



నిడదవోలులో ఓ ఆసుపత్రి పక్కనే ఉన్న మద్యం దుకాణం

నిడదవోలు, ఫిబ్రవరి 16: నిడదవోలులో ఆర్టీసీ డిపోకు సమీపంలోను, ఓ ప్రైవేటు ఆసుపత్రికి ఆనుకుని ఉన్న ఆ మద్యం దుకాణం ముందు నుంచి రాకపోకలు సాగించాలంటే మహిళలే కాదు మగవాళ్లు సైతం హడలెత్తిపోతున్నారు. సాయంత్రమైందంటే చాలు మద్యం దుకాణం వద్ద మందుబాబులు క్యూ కడుతున్నారు. అక్కడ కొనుగోలు చేసిన మద్యంతోపాటు ఆ రోడ్డు పక్కనే ఉన్న బండి వద్ద చిరుతిళ్లు కొనుక్కుని ఆ పక్కనే చీకట్లో మద్యం తాగుతున్నారు. నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్లి వచ్చే మహిళలు, ఆసుపత్రికి వచ్చి వెళ్లే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఆ మద్యం షాపు ముందు నుంచే రాకపోకలు సాగించాలి. రోడ్డు పక్కనే మద్యం తాగి ఆ ప్రాంతమంతా మందుబాబులు వీరంగం చేస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేవాలయం, పాఠశాల, ఆసుపత్రుల సమీపంలో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులు రావు. కాని ఇప్పుడు మద్యం దుకాణాలు అన్ని ప్రభుత్వమే నిర్వహించడంతో వాటికి నిబంధనల ఊసే లేదు. ఈ చుట్టుపక్కల ప్రాంతవాసులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు లేవని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి బస్సు దిగి సుబ్బరాజుపేట వైపు వెళుతున్న మహిళను మందుబాబు వెంబడించి వీరంగం సృష్టించడంతో ఆ దారిన పోతున్న వారు ఆగి మందుబాబుకు బుద్ధి చెప్పడంతో ఆ మహిళ ఊపిరి పీల్చుకుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజాప్రతినిధులు అధికార్లు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆర్టీసీ డిపోకు ఆసుపత్రికి సమీపంలో ఉన్న ఈ మద్యం దుకాణం ఇక్కడ నుంచి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



నిడదవోలు పట్టణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించి 20 రోజులైంది. బహిరంగంగా మద్యం తాగే వారిపైనా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురిపై చర్యలు తీసుకున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించం. బస్టాండ్ సెంటరుపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

-పులపా అప్పారావు, పట్టణ ఎస్ఐ.

ప్రతి విద్యార్థి ప్రయోగాత్మకంగా ఎదగాలి

రాష్ట్రస్థాయికి ఎంపికైన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ప్రాజెక్టు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన అనూషకు సర్టిఫికెట్ అందిస్తున్న డీఈవో

గోపాలపురం, ఫిబ్రవరి 16: విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని ప్రతి విద్యార్థి ప్రయోగాత్మకంగా ఎదగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి అన్నారు. శుక్రవారం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ ఈ నెల 15న రాజమహేంద్రవరంలో సీజేపీఎం పాఠశాలలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయి ప్రదర్శనలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్.అనూష, జీ.లిఖిత ఐబ్లింక్ సెన్సార్ కం యాక్సిడెంట్ కంట్రోల్ వైల్డ్‌ల్యాండ్ అర్బన్ ఇంటర్ డిటెక్షన్ ఆఫ్ ఫైర్ అనే ప్రాజెక్టు తయారు చేసి ప్రదర్శించారని, ఆ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అనూషాకు జిల్లా విద్యాశాఖాధికారి శుక్రవారం సర్టిఫికెట్ అందజేశారని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అనూషాను అభినందించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

చాగల్లు, ఫిబ్రవరి 16: చాగల్లు గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. తమకు అందిన సమాచారంతతో సిబ్బందితో కలిసి దాడి చేసి వారి నుంచి రూ.25 వేలు నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే మండలంలోని కలవలపల్లికి చెందిన ఓ మహిళ సారా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఆమె నుంచి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వర్క్‌ఫ్రం హోం పేరుతో.. రూ.4 లక్షలు దోపిడీ..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లింక్ దోపిడీ కేటుగాళ్ల వలలో పడి ఓ గృహిణి మోసపోయారు. ఆమె త్రీటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. సుభాశ్‌నగర్‌లో నివాసం ఉండే గెడ్డం దివ్య సురేఖకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. గవర్నమెంట్ ప్లాట్‌ఫాంతో వర్క్‌ఫ్రం హోం ఇస్తామని, ఇంటి దగ్గర నుంచే డబ్బులు సంపాదించుకోవచ్చని ఆ మెసేజ్ సారాంశం. దీంతో ఆ మెసేజ్‌కి సురేఖ జవాబు పంపారు. వాట్సాప్ ద్వారా అవతలి వాళ్లు ఈమెతో మాట్లాడి టెలీగ్రాంలో ఒక లింక్ పంపించారు. దానిలో ఉన్న వర్క్ చేసి బాధితురాలు వాళ్లకు పంపించారు. డబ్బులు చెల్లిస్తే ఇంకొంత వర్క్ ఇస్తామని మళ్లీ మెసేజ్ పెట్టారు. ఈ క్రమంలో సురేఖ దఫదఫాలుగా రూ.4,08,000 సదరు సైబర్ నేరగాళ్లకు పంపించారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలంటే రూ.5లక్షలు చెల్లించాలని నేరగాళ్లు అంటున్నారని సురేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. లింక్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అపరిచితులు పంపించే లింక్‌లను క్లిక్ చేయవద్దని.. అనుమానం వస్తే పోలీసులను సంప్రదించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

రథసప్తమి వేడుకలు

- సూర్యనారాయణుడికి ప్రత్యేక పూజలు

దేవరపల్లి, ఫిబ్రవరి 16: రథసప్తమి వేడుకలను శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలోని సాయిబాబా ఆలయం, పూర్ణయోగాశ్రమం వద్ద పూజలు చేసి హోమాలు, పాలపొంగులు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద 108 కలశాలతో స్వామివారికి అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేసింది.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సూర్యనారాయణ మూర్తికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: కొవ్వూరులో భక్తులు వేకువజాము నుంచి గోష్పాదక్షేత్రం చేరుకుని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆపై సుందరేశ్వరస్వామి ఆలయం, స్థానిక సంస్కృత పాఠశాలలోని గోష్పదేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సూర్యనారాయణుడికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు, సూర్యనమస్కారాలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



దేవరపల్లి వెంకన్న ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న పండితులు

నిడదవోలు: నిడదవోలులో సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో సూర్యనారాయణుడికి దేవాలయంలో అర్చకులు, వేద పండితులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులతో సహస్రనామాలతో సూర్య నమస్కారాలు నిర్వహించారు. స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్నులోని సూర్యదేవాలయంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అభిషేకాలు, పూజలు జరిపారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు నిడదవోలులో దళితుడా రా.. కదలిరా

మహాసేన నాయకుడు రాజేష్



వేలివెన్నులో మాట్లాడుతున్న మహాసేన రాజేష్

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 16: నిడదవోలులో ఈనెల 18 ఆదివారం మధ్యాహ్నం జరిగే దగా పడ్డ దళితుడా..రా.. కదలి రా సభను విజయవంతం చేయాలని మహాసేన నాయకుడు రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వేలివెన్నులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును ఆయన స్వగృహంలో కలిసి సభకు రావాలని రాజేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ దళిత పథకాలు రద్దు చేసి దళితులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. అనంతరం రాజేష్‌ను శేషారావు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, బైపే రాజేశ్వరరావు, పాతూరి నరేంద్ర, చీపుళ్ల వెంకట్రావు, కత్తుల సుధీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల దరఖాస్తులు పరిష్కరించలేదు

రెవెన్యూ అధికారులపై పలువురు సర్పంచ్‌ల ఆరోపణ

తాళ్లపూడి మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి, ఫిబ్రవరి 16: స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండలంలోని అధికారులు, నాయకులతో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విచ్చేశారు. కార్యక్రమం ప్రారంభంలోనే ప్రజా ప్రతినిధులు పనిచేయని అధికారులతో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ సమీక్షకు హాజరుకాని అధికారులకు ఎందుకు హాజరుకాలేదు అన్న విషయంపై ఫోన్‌లోనే ఆరా తీసి ప్రజల కోసం పనిచేయక పోతే ఎలా అని సున్నితంగా హెచ్చరించారు. సుమారు సంవత్సర కాలంగా పంచాయతీరాజ్ ఏఈ లేకపోవడంతో అనేక భవన నిర్మాణాల బిల్లులు కాలేదని, 90 రోజుల్లో ఇళ్ల దరఖాస్తులు ఇంకనూ పరిష్కరించలేదని రెవెన్యూ అధికారులపై పలువురు సర్పంచులు ఆరోపించారు. పోచవరం, తాడిపూడి గ్రామాల్లో కొంత మంది దళిత రైతులకు పట్టాలు ఇచ్చారు కానీ సబ్‌డివిజన్ చేయకపోవడంతో వ్యవసాయానికి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయా గ్రామాల నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేపాల్గొన్న తొలి సమావేశం ఆద్యంతం నాయకులు పలు సమస్యలు చెబుతూనే ఉన్నారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ ముఖ్యంగా రెవెన్యూ శాఖ విషయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	: ఈగల్
వై.స్క్రీన్2	: రాజధాని ఫైల్స్
దేవిశ్రీ(గాయత్రి)	: హనుమాన్
అనన్య	: అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	: ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	: రాజధాని ఫైల్స్
శ్రీగణపతి	: ఈగల్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	: సలార్
శ్రీనివాస	: సలార్